


# ప్రేమంటే...

"కౌముదీ."

"ఊఁ."

"ఏమిటంత మౌనం?"

"వెన్నెల ఎంత బాగుందో-చూడండి ఈ కిటికీలో నుంచి."

"నువ్వే వెన్నెల, నీ పేరే వెన్నెల. నా జీవితం నీ రాకతో వెన్నెలమయమైంది."

కౌముది వెన్నెల్లా నవ్వింది.

"కవులనిపించారు."

"నిన్ను చూస్తే చాలు, కలం కవిత్వం పలుకుతుంది...."

"చాలు ఆపండి. ఎవరైనా వింటే నవ్వుతారు."

"నవ్వుతారా? నవ్వనీ-నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అంటాను."

"మీతో ఏం మాట్లాడాలన్నా కష్టమే."

"నీ వెన్నెల వీక్షణాలు చాలించి రావోయ్..." అని శరత్ అనగానే పువ్వులా అతని ఒడిలో వాలిపోయింది.

పెళ్ళైన మూడు నెలలకుగానీ హనీమూన్‌కి టైమ్ కుదరలేదు కౌముదీ, శరత్‌లకు.

రైల్లో ఫస్ట్ క్లాసు కూపేలో ఆనందపు టంచుల్లో ఉన్నాయి ఇద్దరి మనసులు.

అక్షరాలా వాళ్ళిద్దరిదీ పెద్దలు కుదిర్చి చేసిన పెళ్ళి. మూడు నెలల క్రితం వరకు ఇద్దరూ ఒకరినొకరు చూసుకునైనా ఎరుగరు. అయితే కలసిన మనసులో లేక కొత్త ఆకర్షణో గాని ఒకరినొకరు చూసుకోకుండా ఉండలేని పరిస్థితిగా ఉంది.

పెళ్ళి తర్వాత ఒక్క మూడు రోజులు మాత్రం పుట్టింటికి వెళ్ళింది కౌముది. ఆ మూడు రోజుల్లోనే శరత్‌కి అన్నం సయించలేదు. ఏపని మీదా ధ్యాస పోలేదు. గడ్డం పెంచేసి ఓ కావ్యం రాసేశాడు. అప్పటికీ ఆమె దర్శనం కాక పోయేసరికి రెక్కలు గట్టుకుని ఆమె సమక్షంలో వాలాడు. అతని అవతారం చూసి ఆమెకి నవ్వాగలేదు.

పాపం కౌముది తప్పేమీలేదు. స్నేహితురాళ్ళు, సన్నిహితులు, అక్కలు చెల్లెళ్ళు బంధువులూ ఆమెను ఎంతో మాట్లాడించాలని, తమతోగడపమని చెప్పిచూశారు. కానీ కౌముది, మనసు చకోరమై శరత్ చెంతనే ఉంది. అందువల్ల వాళ్ళతో కలవకపోయేది. ఆ మాటే కౌముది అంటే చిరుకోపంతో శరత్ "నువ్వా

కవిత్వం చెప్తున్నావే" అన్నాడు. "శ్రీవారి ప్రభావం మరి" -అంది.

"నేనీ మూడురోజుల్లో కావ్యమే వ్రాశాను" అన్నాడు శరత్. "ఒక్క క్షణంకూడా నీ విరహాన్ని భరించలేను" అన్నాడు మళ్ళీ.

"మరి పదిహేనురోజుల కిందటి వరకో-"

"ఓహ్! చాలా సమయం వృధా అయిపోయింది. అదంతా ఇప్పుడు గుర్తు చేయకు" అన్నాడు శరత్.

కౌముది తల్లి ఇద్దర్నీ మరో రెండు రోజులుండమని ఎంత అడిగినా అప్పటికప్పుడే కౌముదిని తీసుకువెళ్ళి పోయాడు శరత్.

ఊహలు పంచుకుని, ప్రేమలు కలబోసుకుని భవిష్యత్ హర్మ్యాలు నిర్మించుకుని ప్రేమయాత్ర ముగించుకుని ఇరవై రోజులకు ఇల్లు చేరారు ఇద్దరూ.

ఇల్లు చేరేసరికి కౌముది పేరా, శరత్ పేరా బోలెడన్ని ఉత్తరాలు పడి ఉన్నాయి. ముందు గదిలో అన్నీ టేబుల్ మీద పెట్టి ఇల్లు సర్ది గబగబ వంట కార్యక్రమం పూర్తి చేసింది కౌముది. ఇద్దరూ స్నానం చేసి భోజనం పూర్తి చేశాక వచ్చిన ఉత్తరాల్లో శరత్ పేరున్నవి శరత్‌కి అందించి, తన పేరున వచ్చిన నాలుగు ఉత్తరాల్లో ఒకటి విప్పింది.

ఒక ఉత్తరం అమ్మ వ్రాసింది. ఇంకొకటి అన్న బెంగుళూర్ నుంచి, ఇంకొకటి నళిని వైజాగ్ నుంచి. నాల్గో ఉత్తరం వ్రాసింది రవి.

"ప్రియమైన కౌముదికి,

నా జీవితం నిస్సారమైన ఎడారిలా ఉంది. నీతోనే వెన్నెల వెళ్ళిపోయింది. మిగిలింది తమస్సే. ఎంత చెప్పినా వినకుండా ప్రేమించిన చోట పెళ్ళి జరగకూడదని నా జీవితాన్ని శూన్యం చేశావు. మనం కలసివుంటే తప్పక మన జీవితం పూలనావలా సాగిపోయేది. మనం కలవక పోయినా బాగుండేది. నీడలావచ్చి మాయమైనావు. 'ప్రేమను శాశ్వతంగా మనసులో దాచుకుంటాను. పెళ్ళితో ముడిపెడితే నిస్సారమవుతుందంటూ' మొండిపట్టుదలతో నా నుంచి దూరమైనావు. నిన్ను చూడాలనివుంది. ఒకే ఒక్కసారి నిన్ను చూసి వెళ్ళిపోతాను. ఆదివారం వస్తాను.

నీ

రవి."

కౌముది ముఖం వివర్ణమయింది. రవి ఉత్తరం వ్రాస్తాడని ఆమె ఊహించలేదు.

శరత్ ఈ విషయాన్ని ఎట్లాతీసుకుంటాడో తెలియదు. ఈ ఉత్తరం చూపించక పోవడమే శ్రేయస్కరం.

శరత్ ఉత్తరాలు చూడటం ముగించి "ఏమోయ్, ఇంకా కాలేదా నీ ఉత్తరాలు చదవడం..." అన్నాడు ఒళ్ళు విరుచుకుంటూ.

ఈ ఉత్తరం శరత్ చూస్తే ప్రేమస్రోతస్వినిలో కలకలం రేగి శరత్ ప్రేమ దూరమవుతుందేమోనన్న భయం ఆమెలో ఆవహించింది. ఇప్పుడు కౌముది మనసులో శరత్ రూపం తప్ప మరేమీ లేదు. రవితో ప్రేమ వ్యవహారమంతా హాస్యాస్పదంగాఅనిపిస్తున్నదిప్పుడు.

అదొక వయసు చాంచల్యంగా, పరిపక్వత చెందని మనోవికారంగా ఉంటుంది తలుచుకుంటే. అసలు ప్రేమ ఏమిటి? అయినా సాన్నిహిత్యం, ఇష్టం తప్ప తను నిజంగా అతన్ని ప్రేమించిందా? ఇంకో ముఖ్యమైన విషయం- తామెప్పుడూ హద్దుమీరలేదు.

"ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" ఆశ్చర్యంగా చూశాడు శరత్ కౌముదిని.

"ఏంలేదు, అమ్మావాళ్ళు గుర్తొచ్చారు" అంది చిన్నగా నవ్వుతూ.

శరత్ అదంతా సీరియస్‌గా తీసుకోలేదు. అసలు కౌముది ఉత్తరాలనూ పట్టించుకోలేదు. సరదాగా చదువుతానని అంటాడేమోనని ఏమూలో భయపడ్తోంది. కౌముది. తను తప్పు చేయకపోయినా శరత్ ఎట్లా అర్థం చేసుకుంటాడో......

"ఇదిగో, సరదాగా ఈ ఉత్తరం చదువు..." నవ్వుతూ శరత్ ఆమె చేతిలో కవరు అందించాడు.

"ఎవరు వ్రాశారు?" అంటూ కవరు అందుకుంది. "చదువు నీకే తెలుస్తుంది" అంటూ తనేదో వారపత్రిక చేతిలోకి తీసుకున్నాడు.

"ప్రియమైన శరత్,

కనులు మూసినా, తెరచినా నీ రూపమే. నువ్వు లేని నా బ్రతుకు వ్యర్థం. ప్రేమంటే గిట్టదంటావ్. ప్రేమ- పెళ్ళిళ్ళమీద నమ్మకం లేదంటావు. మరి అట్లాంటప్పుడు నా జీవితంలోకి ఎందుకొచ్చావు? పెళ్ళి చేసుకున్నాక ప్రేమించాలనే నీ సిద్ధాంతం ముందుగా నాకు తెలిసిఉంటే నిన్ను కలవకుండా పెద్దవాళ్ళ ద్వారా మన పెళ్ళి జరిగేది. నువ్వు నన్నెంత నిరుత్సాహపరచినా నేను నీ మీద ఆశలు పెంచుకున్నాను. నాకు ఊరటగా ఒక్క ఉత్తరమన్నా వ్రాయవూ? నాది చిన్నతనమనీ, వయసు చాంచల్యమని కొట్టిపారేయకు. నిన్ను మరచిపోదామని ప్రయత్నిస్తున్నా. సాధ్యం కావడంలేదు.

ఉంటామరి.

నీ

నీరజ"

ఉత్తరం దిగ్భ్రాంతితో చదివి తలెత్తి శరత్ మొహంలోకి చూసింది కౌముది.

"కోపం వచ్చిందా?" అన్నాడు నవ్వుతూ శరత్.

"రాలేదు" అంది మెల్లగా కౌముది.

"ఆమె నన్ను ఇష్టపడింది. నాకూ నీరజంటే ఇష్టమే. కాని పెళ్ళికి ముందు ఇవన్నీ ఒక రకమైన ఆకర్షణలు. పెళ్ళితోనే తొలి పరిచయంగా నా భార్య రావాలని నా కోరిక అదే విషయం నీరజతో ఎన్నోసార్లు చెప్పాను. కానీ నీరజ వినలేదు. నా మీద ఆశలు పెంచుకోవద్దని స్పష్టంగా చెప్పాను. మన పెళ్ళి జరగదనీ చెప్పాను. నిన్ను చూడగానే అనిపించింది. ఇన్నాళ్ళ నా అన్వేషణ ఫలించిందని ఏమంటావు?" అన్నాడు వివరణగా శరత్.

కౌముది హృదయం తేలికపడింది. శరత్ ఆలోచనాధోరణి తనలాగే ఉంది. ఒకే రకమైన భావాలుగల తామిద్దరూ ఇలా ఒకటవటం ఆమెకు వింతనిపించింది.

చిరునవ్వుతో రవి రాసిన లెటర్ని భర్తకి అందించి "ఇదే నా సమాధానం" అని అతని ముఖంవంకే చూడసాగింది ఆసక్తిగా.

ఉత్తరం చదువుతుండగానే శరత్ వదనంలో రంగు మారింది.

కౌముది ముఖంలో కళకూడా తప్పింది.

శరత్ కళ్ళు ఎర్రబడినాయి. అదురుతున్న పెదవులతో ఏదో అస్పష్టంగా ఉచ్చరించి విసురుగా పక్కగదిలోకి వెళ్ళిపోయాడు.

ఆదివారం రానే వచ్చింది.

రవి కూడా వచ్చాడు.

సరిగ్గా మూడు నెలల తర్వాత కౌముది, శరత్‌లు ఎందుకు విడాకులు తీసుకున్నారో అర్థంగాక బంధుమిత్రులందరూ విభ్రాంతి చెందారు. *

